వాజేడు పోలీస్ స్టేషన్‌లో కేసుల వివరాలను పరిశీలిస్తున్న ఎస్పీ శబరీష్

మావోయిస్టుల కదలికలపై నిఘా పెంచాలి

ములుగు ఎస్పీ శబరీష్

వాజేడు, అక్టోబర్ 11 : మావోయిస్టుల కదలికలపై నిఘా పెంచాలని ఎస్పీ శబరీష్ పోలీసులకు సూచించారు. శుక్రవారం ఆయన వాజేడు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. సిబ్బంది కిట్ ఆర్టికల్స్, ఆయుధ సామగ్రిని తనిఖీ చేశారు. రిసెప్షన్ వద్ద ఉన్న ఫిర్యాదుల రిజిస్టర్‌తో పాటు, రికార్డులు, కంప్యూటర్‌లో పొందు పర్చిన ఫిర్యాదులను పరిశీలించారు. ఎస్సై రుద్రరాపు హరీశ్ తోపాటు పోలీస్ సిబ్బందికి సూచనలను చేశారు. ఆదివాసీలకు అండగా ఉండడంతో పాటు వారికి చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే శాఖా పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంత గ్రామాలను నిత్యం సందర్శిస్తూ ప్రజల భద్రతపై నిత్యం దృష్టి సారించాలన్నారు. సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకొని సమస్యల పరిష్కార దిశగా ఆదేశాలు జారీచేశారు. ఆయన వెంట వెంకటాపురం సీఐ బడారు కుమార్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

డీడీ పోచంను తొలగించాలి

వెంకటాపూర్, అక్టోబర్ 11 : గిరిజనుల విద్యాభివృద్ధికి కృషి చేయని డీడీ పోచంను తొలగించాలని జాక్(టీబ్ల్యూ) అనుబంధ సంఘమైన టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పోరిక శ్రవణ్‌కుమార్, అజ్మీరా రాజు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల్లో స్కూల్ అసిస్టెంట్ క్యాడర్ వారీగా క్లియర్ వేకెన్సీలు చూపించినప్పటికీ ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్‌లో వాటిని బ్లాక్ చేయడం వల్ల సీనియర్ ఉపాధ్యాయులకు అన్యాయం జరిగిందన్నారు. వారికి న్యాయం చేయాలని ఎన్నిసార్లు విన్నవించినా డీడీ పట్టించుకోలేదన్నారు.

కార్పొరేట్ విద్య అందించడమే లక్ష్యం

- వరంగల్ ఎంపీ కడియం కావ్య
- మైలారంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలకు శంకుస్థాపన
- హాజరైన ఎమ్మెల్యే జీఎస్ఆర్, కలెక్టర్ రాహుల్‌శర్మ



పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీ కావ్య, ఎమ్మెల్యే జీఎస్ఆర్, కలెక్టర్ రాహుల్‌శర్మ

గణపురం, అక్టోబర్ 11 : విద్యార్థులకు కార్పొరేట్ విద్య అందించేందుకే ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీ కడియం కావ్య అన్నారు. శుక్రవారం మండలంలోని మైలారంలో పాఠశాల నిర్మాణానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ మేనిఫెస్టోలో ఇవ్వనటువంటి అభివృద్ధి కార్యక్రమాలు కూడా చేపడుతున్నట్లు చెప్పారు. డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి పదకొండు వేల మందికి ఉద్యోగాలు ఇచ్చామని, ఇదొక పెద్ద సాహసమన్నారు. మొదటి దశలో 28 నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నామని, అనంతరం అన్ని నియోజకవర్గాల్లో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో జాతీయ రహదారుల నిర్మాణానికి కేంద్ర జాతీయ రహదారుల అధికారులతో మాట్లాడి నాలుగు లేన్ల రోడ్డు నిర్మాణానికి రూ.660 కోట్ల మంజూరుకు ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. బుగులోని వేంకటేశ్వరస్వామి, పాండవుల గుట్ట, కోటగుళ్లు, గణప సముద్రం చెరువు అభివృద్ధికి నిధుల మంజూరుకు కృషి చేస్తానన్నారు. ఇంటిగ్రేటెడ్ పాఠశాలలో 5 వేల పుస్తకాలతో లైబ్రరీ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 2,568 మంది విద్యార్థులు, 120 మంది ఉపాధ్యాయులు ఉంటారని, 21 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయులు ఉంటారని చెప్పారు. ఎమ్మెల్యే జీఎస్ఆర్ మాట్లాడుతూ రూ.176 కోట్లతో ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూళ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు చేశారని, 40 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించినట్లు తెలిపారు. పదేళ్లుగా హనుమకొండలో ఉన్న సాంఘిక సంక్షేమ డిగ్రీ కళాశాలకు రూ.8 లక్షలు కిరాయి కడుతున్నామని, ఇలా గాంధీనగర్, లింగాల వంటి గురుకుల పాఠశాలలు ఇతర ప్రదేశాల్లో నిర్వహిస్తున్నారని తెలిపారు. అందుకే సీఎం రేవంత్ రెడ్డి అంతర్జాతీయ ప్రమాణాలతో సమీకృత విద్యాలయాల నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. కేంద్రీయ విద్యాలయం నిర్మాణానికి ఇక్కడే 10 ఎకరాలు కేటాయించామని, జాతీయ రహదారికి పక్కన ట్రామా కేర్ యూనిట్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 20 ఎకరాల్లో జిల్లా కేంద్రంలో గ్రెయిన్ మార్కెట్ నిర్మించనున్నట్లు చెప్పారు. సింగరేణి సంస్థ నుంచి 20 రకాల అంశాల్లో నైపుణ్యత అందించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. 200 ఎకరాల్లో యూనివర్సిటీ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రూ.60 కోట్లతో భూపాలపల్లి సెంటర్ నుంచి సీఆర్ నగర్ వయా గొర్లవీడు, గాంధీనగర్ మీదుగా రింగురోడ్డు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జాతీయ రహదారి నిర్మాణానికి ఆరు కిలోమీటర్లు అడవి ఉందని అటవీ క్లియరెన్స్ తీసుకురానున్నట్లు చెప్పారు. ములుగు నుంచి కరీంనగర్ వరకు రెండు వరుసల రహదరి నిర్మాణానికి త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. కొడవటంచ ఆలయ అభివృద్ధికి రూ. 12.15 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ స్కూల్‌లో 4 నుంచి ఇంటర్మీడియట్ వరకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యాబోధన జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ట్రైడ్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాశ్‌రెడ్డి, డీఈవో రాజేందర్, బీసీ సంక్షేమ అధికారి శైలజ, డీపీవో నారాయణరావు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, సహకార సంఘాల చైర్మన్లు పాల్గొన్నారు.

మద్యం షాపులో ఇరు వర్గాల మధ్య ఘర్షణ

సీసాలతో పొడుచుకున్న వైనం.. ఇద్దరి పరిస్థితి విషమం

ములుగురూరల్, అక్టోబర్11: మద్యం షాపులో ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగి సీసాలతో పొడుచుకున్న ఘటన శుక్రవారం ములుగు మండలం మల్లంపల్లి మద్యం షాపు వద్ద జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా శాయంపేట మండలం ల్యాదెళ్ల గ్రామానికి చెందిన ఈసంపల్లి మహేశ్, ములుగు మండలం జంగాలపల్లి గ్రామానికి చెందిన మారపాక మల్లికార్జున్ మద్యం దుకాణం వద్ద ఉన్న సిట్టింగ్‌లో మద్యం సేవిస్తున్నారు. అదే సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు సైతం మద్యం సేవించడానికి వచ్చారు. వీరికి మాటామాట పెరిగి ఘర్షణకు దారితీసింది. దీంతో తాగిన మైకంలో బీరు సీసాలతో దాడి చేయగా మహేశ్‌తో పాటు మల్లికార్జున్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకొని చికిత్స నిమిత్తం ములుగు ప్రభుత్వ దవాఖానకు తరలించారు. దాడిలో మహేశ్ మెడ భాగంలో తీవ్ర గాయం కాగా తీవ్ర రక్తస్రావం జరిగింది. ప్రథమ చికిత్స అందించిన అనంతరం మహేశ్‌తోపాటు మల్లికార్జున్‌ను వైద్యులు ఎంజీఎం దవాఖానకు రెఫర్ చేసినట్లు తెలిసింది.

జ్యోతికి రూ.1.19 లక్షల చెక్కు అందజేత

పలిమెల, అక్టోబర్ 11 : మండలకేంద్రానికి చెందిన కావేరి జ్యోతి ఇటీవల పారా త్రోబాల్ అథ్లెటిక్స్ క్రీడలకు అంతర్జాతీయ స్థాయికి ఎంపికైంది. కాగా, ఈ క్రీడల్లో ఆడేందుకు రూ.లక్ష వరకు ఖర్చు అవుతుంది. జ్యోతిది నిరుపేద కుటుంబం కావడంతో అంత నగదు పెట్టే స్థోమతలేక మంత్రి శ్రీధర్‌బాబును సాయం కోరారు. శుక్రవారం పెద్దపల్లి జిల్లా మంథని మండలం అడవి సోమనపల్లి గ్రామానికి వచ్చిన మంత్రి ప్రభుత్వం నుంచి రూ.1.19లక్షల చెక్కును అందించారు.

మత్తు పదార్థాల నిర్మూలనలో భాగస్వామ్యం కావాలి

భూపాలపల్లి రూరల్, అక్టోబర్ 11 : జిల్లాలో గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ఎస్పీ కిరణ్ ఖరే శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గంజాయి, డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చాలన్న సంకల్పంతో జిల్లా పోలీస్ శాఖ పనిచేస్తుందని పేర్కొన్నారు. గంజాయి సేవించే, రవాణా చేస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నామన్నారు. గతంలో గంజాయి కేసుల్లో నిందితులుగా ఉన్న వారికి వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్‌తో పాటు, అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఇప్పటికే గంజాయి, డ్రగ్స్‌కు అలవాటుపడి ఇబ్బందులు ఎదుర్కొంటే, వెంటనే వంద పడకల దవాఖానలో ఏర్పాటు చేసిన డి అడిక్షన్ సెంటర్‌కు రావాలన్నారు. మంచి వైద్య బృందంతో పాటు, అన్ని రకాల సౌకర్యాలు ఉంటాయన్నారు. మత్తుకు బానిస అయి ఇబ్బంది పెడుతున్న వారి వివరాలు పోలీసులకు తెలపాలని ఎస్పీ కోరారు. వారి వివరాలు గోప్యంగా ఉంచనున్నట్లు చెప్పారు.

దసరా వేడుకలకు ఏర్పాట్లు

కాటారం, అక్టోబర్ 11 : మండలకేంద్రంలో దసరా వేడుకలు నిర్వహించేందుకు శుక్రవారం తిమ్మనగుట్ట, పీహెచ్‌సీ వద్ద ఏర్పాట్లు చేస్తున్నారు. బీఆర్ఎస్ నేత జక్కు రాకేశ్, మాజీ ఉప సర్పంచ్ నాయిని శ్రీనివాస్, నాయకులు కొట్టె ప్రభాకర్ తదితరులు పరిశీలించారు. రావణ వధ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారం సాయంత్రం 6 గంటలకు నిర్వహించే వేడుకల్లో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పీఎంజేజేబీవై ఇన్సూరెన్స్ చెక్కు అందజేత

మంగపేట, అక్టోబర్ 11 : మండలంలోని నర్సింహసాగర్‌కు చెందిన పన్నాటి లక్ష్మికి శుక్రవారం ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన ఇన్సూరెన్స్ చెక్కు రాగా కమలాపురం ఏపీరేయాన్స్ ఎస్‌బీఐ బ్రాంచి మేనేజర్ కే శ్యామ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామీణులు ఇన్సూరెన్స్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ సీఎస్‌పీ నిర్వాహకుడు నందిగాం లోకనాథ్, తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు

వెంకటాపూర్, అక్టోబర్ 11 : మండలంలోని ఎల్లారెడ్డిపల్లి గ్రామ కార్యదర్శి రమేశ్‌పై అదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు గురువారం దాడి చేయగా శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సద్దుల బతుకమ్మ సందర్భంగా గ్రామ బతుకమ్మ ఆట స్థలంలో డీజే ఏర్పాటు చేశారు. కొంత సేపటికి డీజే పని చేయకపోవడంతో మద్యం మత్తులో ఉన్న దేవేందర్‌రెడ్డి, సుధాకర్ తనపై దాడి చేసినట్లు కార్యదర్శి ఫిర్యాదులో పేర్కొన్నారు.

రామప్పలో పర్యాటకుల సందడి

వెంకటాపూర్, అక్టోబర్ 11 : పర్యాటకులతో రామప్ప ఆలయం శుక్రవారం సందడిగా మారింది. తెలుగు రాష్ట్రాలతో పాటు రాజస్థాన్, కేరళ, మహారాష్ట్ర, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాల పర్యాటకులు రాగా అర్చకులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్ స్వామి వారికి పూజలు చేసి వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ చరిత్ర, శిల్పకళ విశేషాలను టూరిజం గైడ్స్ తెలుసుకొని ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం రామప్ప చెరువును సందర్శించి బోటింగ్ చేశారు. అలాగే అమెరికాకు చెందిన ఆలయాన్ని జోన్స్ సందర్శించారు. ఆలయ విశిష్టతను తెలుసుకున్న అనంతరం మాట్లాడుతూ బ్యూటిపుల్ కార్వింగ్స్ ఉన్నాయని, రామప్ప టెంపుల్ తాను చూసిన టెంపుల్స్‌లో మార్వలెస్‌గా ఉందని అన్నారు. తాను బైక్‌పై ఇండియా మొత్తం 150 రోజులు ప్రయాణం చేస్తున్నానని అన్నారు.

ఘనంగా బలిహరణ

ఏటూరునాగారం, అక్టోబర్ 11 : శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గాదేవి శుక్రవారం మహిషాసురమర్ధిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి బలిహరణ కార్యక్రమాన్ని అంత్యంత వైభవంగా చేపట్టారు. బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు చేసి గుమ్మడికాయను బలి రూపంలో ఇచ్చారు. అక్కడ నుంచి ఊరేగింపుగా స్టార్ యూత్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ నిర్మాణ స్థల మండపం వద్దకు చేరుకున్నారు. ఇక్కడ బలి హరణ కోసం మండపం చుట్టూ గుమ్మడి కాయలు పెట్టి మహిషాసుర మర్దిని అవతారంలో ఉన్న భక్తులు బలి ఇచ్చారు. కార్యక్రమంలో ఆయా మండపాల నిర్వాహకులు, అర్చకులు రాధాకృష్ణశర్మ, ముక్కెర భిక్షపతి, గంజి రమేశ్, చెల్పూరి రామనాథం, పున్నెం కిరణ్, ప్రశాంత్, అక్షిత్, సాయి, వెలకుర్తి లక్ష్మణాచారి పాల్గొన్నారు.

వాహనం అదుపు తప్పి పలువురికి గాయాలు

ములుగురూరల్, అక్టోబర్ 11 : వాహనం అదుపు తప్పి పలువురికి గాయాలైన ఘటన జిల్లా కేంద్రంలోని ఆర్టీవో కార్యాలయం ఎదుట జాతీయ రహదారిపై శుక్రవారం మధ్యాహ్నం జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. జిల్లా కేంద్రం నుంచి ఇన్నోవా వాహనంలో ములుగు మండలానికి చెందిన కల్లెపు పవన్, మునిప్రసాద్, చేతన్, హర్షవర్ధన్, నిఖిల్, నరేశ్ జంగాలపల్లి వైపు వెళ్తున్నారు. ఆర్డీవో కార్యాలయం వద్దకు చేరుకోగానే వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మునిప్రసాద్‌కు తీవ్ర గాయాలు కాగా, మిగిలిన ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్సై వెంకటేశ్వర్‌రావు అక్కడికి చేరుకొని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ములుగు దవాఖానకు తరలించారు. మునిప్రసాద్ పరిస్థితి విషమంగా ఉండగా ఆయనతో పాటు ఐదురురిని వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించినట్లు తెలిసింది.

రావణ వధ ఏర్పాట్ల పరిశీలన

కృష్ణకాలనీ, అక్టోబర్ 11 : విజయదశమి పురస్కరించుకొని అంబేద్కర్ స్టేడియంలో మున్సిపల్ పాలకవర్గం 40 అడుగుల రావణాసుర వధ కార్యక్రమానికి ఏర్పాట్లు చేసింది. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణీ సిద్ధు, వైస్ చైర్మన్ గండ్ర హరీశ్‌రెడ్డి, భూపాలపల్లి సీఐ నరేశ్‌కుమార్‌తో పాటు మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ నూనె రాజు, కౌన్సిలర్లు ఎడ్ల మౌనికా శ్రీనివాస్, ముంజంపల్లి మురళీధర్, జాగృతి రాష్ట్ర నాయకుడు మాడ హరీశ్‌రెడ్డి, నాయకులు గాజుల అరుణ్ ఏర్పాట్లను పరిశీలించారు.

రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తిని సాధించాలి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్, అక్టోబర్ 11 : యంత్రాల పని గంటలు పెంచుకొని రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తిని సాధించాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శుక్రవారం భూపాలపల్లి సింగరేణి ఏరియా యాజమాన్యం ఆధ్వర్యంలో అన్ని గనులు, మైన్స్ రెస్క్యూ స్టేషన్ ఆవరణలో 'ఉద్యోగులకు ఉజ్వల సింగరేణి –ఉద్యోగుల పాత్ర' అనే అంశంపై అవగాహన, కంపెనీ స్థితిగతులు, విధి నిర్వహణలో ఉద్యోగులు గమనించాల్సిన విషయాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే జీఎస్ఆర్, జీం సయ్యద్ హబీబ్ హుస్సేన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కంపెనీ స్థితిగతులను ఎల్ఈడీ స్క్రీన్‌పై మల్టీ డిపార్ట్మెంటల్ కమిటీ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం ఆదేశాల మేరకు సింగరేణి సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ బలరాం సలహాలు, సూచనలు అనుసరించి ఉద్యోగులు పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏరియా అధికార ప్రతినిధి కావూరి మారుతి, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రెటరీ మోటపలుకుల రమేశ్, ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జోగ బుచ్చయ్య, ఎస్‌వోటుజీఎం కవీంద్ర పాల్గొన్నారు.

చివరి దశకు మెట్ల మార్గం

ములుగురూరల్, అక్టోబర్ 11 : కొత్తూరు గ్రామ శివారులోని గుట్టపై ఉన్న పురాతన ఆలయం వరకు అటవీశాఖ అధికారులు చేపడుతున్న మెట్ల మార్గం శుక్రవారం చివరి దశకు చేరుకుంది. గుట్ట కింది నుంచి పైకి కిలోమీటర్ దూరం ఉంటుంది. ఏడు వందల మీటర్ల మేర మెట్ల మార్గాన్ని అటవీశాఖ అధికారులు సెప్టెంబర్‌లో పనులు ప్రారంభించగా 80శాతం వరకు ప్రస్తుతం పూర్తయ్యాయి. మిగతా పనులు పూర్తయిన వెంటనే అటవీ శాఖ అధికారులు పర్యాటకులు సందర్శించేందుకు చర్యలు తీసుకోనున్నారు.

గుట్టపైకి ఉన్న మెట్ల మార్గం

ట్రాన్స్‌ఫార్మర్‌ను పగలగొట్టిన దొంగలు

మంగపేట, అక్టోబర్ 11 : మండలంలోని చుంచుపల్లి శివారు పంట పొలాల్లోని 63 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు పగలగొట్టారు. గురువారం సాయంత్రం గ్రామంలో సద్దుల బతుకమ్మ సంబురాల్లో ఉండగా, ఇదేఅదనుగా భావించిన దొంగలు ట్రాన్స్‌ఫార్మర్‌ను గద్దెమీద నుంచి కిందకు దొర్లించి పగల గొట్టారు. అల్యూమినియం వైరు ఉండడంతో దానికి విలువ ఉండదని అలాగే వదిలేసి వెళ్లినట్లు సమాచారం. నిందితులను గుర్తించి చర్యలు తీసుకోవాలని స్థానిక రైతులు కోరారు.

ఆయుధ పూజ చేస్తున్న ఎస్పీ కిరణ్‌ఖరే దంపతులు

చెడుపై విజయానికి చిహ్నం విజయదశమి

భూపాలపల్లి ఎస్పీ కిరణ్‌ఖరే

భూపాలపల్లి రూరల్, అక్టోబర్ 11 : చెడుపై మంచి సాధించిన విజయానికి చిహ్నంగా విజయదశమి పండుగను నిర్వహించుకుంటామని ఎస్పీ కిరణ్‌ఖరే అన్నారు. శుక్రవారం జిల్లా ఆర్మ్డ్ రిజర్వు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ దంపతులు ఆయుధాలు, వాహనాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సమాజంలో చెడును పారదోలేందుకు పోలీస్ విభాగం నిరంతరం కృషి చేస్తుందన్నారు. జిల్లా ప్రజలకు, పోలీస్ ఆధికారులు, సిబ్బందికి ఆయన దసరా శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు, సీఐలు నరేశ్‌కుమార్, వసంత్‌కుమార్, నగేశ్, కిరణ్, రత్నం, శ్రీకాంత్, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టర్ పీ శబరీష్ పాల్గొని ఆయుధ పూజ చేశారు. ప్రభుత్వం సమకూర్చిన అధికారిక వాహనాలకు ఎస్పీ పూజలు చేశారు. దుర్గామాత చిత్రపటం వద్ద వేద పండితులు మంత్రోచ్చరణల నడుమ ప్రత్యేక పూజలు చేశారు. ఆయుధ పూజకు సూచకంగా ఎస్పీ కరవాలంతో సోరకాయను ఆయుధాల ముంగిట కొట్టారు. అనంతరం జమ్మిచెట్టుకు పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి చిహ్నంగా జరుపుకునే దసరా పండుగను ప్రజలంతా భక్తి శ్రద్ధలతో ఆనందోత్సవాల నడుమ నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ సదానందం, డీఎస్పీ రవీందర్‌తో పాటు ములుగు జిల్లాలో పనిచేస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆయుధ పూజలో ములుగు ఎస్పీ

ములుగురూరల్ : దసరా పండుగ సందర్భంగా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో నిర్వహించిన ఆయుధ పూజా కార్యక్రమంలో ఎస్పీ

సోరకాయను నరుకుతున్న ఎస్పీ శబరీష్



జడ్జీ కన్నయ్యలాల్‌కు ఆహ్వాన పత్రిక అందిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

రావణవధకు ప్రముఖులకు ఆహ్వానం

ములుగురూరల్, అక్టోబర్ 11 : దసరా పండుగ సందర్భంగా ధర్మజాగరణ సమితి ఆధ్వర్యంలో జరిపే రావణవధకు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గండ్రకోట కుమార్ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జాతీయ రహదారి పక్కన ఉన్న మైదానంలో జరిపే ఉత్సవాలకు హాజరు కావాలని కలెక్టర్, ఎస్పీ, డీఎస్పీ ఇతర అధికారులతోపాటు ములుగు సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కన్నయ్యలాల్‌కు సైతం శుక్రవారం ఆహ్వాన పత్రికను అందించారు. అసుర శక్తిపై దైవ శక్తి విజయం పేరిట ఆహ్వాన పత్రికలను ముద్రించి జిల్లా కేంద్రంలోని ప్రతి ఒక్కరికీ హాజరు కావాలని అందించారు. రావణవధ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉత్సవ కమిటీ సభ్యులు శుక్రవారం ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు.

సిద్ధిదా అలంకరణలో అమ్మవార్లు

కాళేశ్వరం, అక్టోబర్ 11 కాళేశ్వర, ముక్తీశ్వర స్వామి అనుబంధ ఆలయం శుభనంధ, మహాసరస్వతి అమ్మవారి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సిద్ధిదా మాతగా అమ్మవారిని అలంకరించారు. మధ్యాహ్నం పూర్ణాహుతి కార్యక్రమం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మమత, మాజీ సర్పంచ్ వసంత, భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయంలో ఉన్న దుర్గామాత విగ్రహం వద్ద అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. పర్యవేక్షకుడు బుర్రి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహిషాసుర మర్దినిగా అమ్మవారు

కాటారం : మండలకేంద్రంలోని లక్ష్మీదేవర స్వామి దేవాలయం, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన, బొప్పారం రామాలయంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపాల వద్ద శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మహిషాసుర మర్దినిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు కుంకుమపూజలు భక్తి శ్రద్ధలతో చేశారు.

కొనసాగుతున్న ఉత్సవాలు

మహాదేవపూర్ : మండల కేంద్రంలోని గర్భగౌరీ ఆలయంతో పాటు మండల పరిధిలోని గ్రామాల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవ వేడుకలు శుక్రవారం ఎనిమిదో రోజుకు చేరాయి. అమ్మవారికి మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు మోటం వెంకటేశ్వర్లు, నరసింహస్వామి, మెరుగు లక్ష్మణ్ పాల్గొన్నారు

వెంకటాపురంలో అన్నదానం

వెంకటాపురం(నూగూరు) : దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 9వ రోజు అమ్మవారు మహిశాసుర మర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవ కమిటీ సభ్యులు నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఎస్సై కొప్పుల తిరుపతిరావు హాజరై భక్తులకు అన్నదానం చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు సంతోష్, శ్రీను పాల్గొన్నారు.

కాళేశ్వరం : సిద్ధిదా అలంకరణలో పార్వతి అమ్మవారు

మహదేవపూర్ : పూజలు చేస్తున్న భక్తులు

కాటారం : మహిశాసుర మర్దినిగా అమ్మవారు

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★త్రివేణి హాంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.
NT-331785-All

WANTED HOSPITAL STAFF
★PHARMACY BOYS (మందుల షాపు), OT BOYS (ఆపరేషన్ థియేటర్), SUPERVISIORS (Administrators) & LAB TECHNICIANS కావలెను. సంప్ర : గార్డియన్ హాస్పిటల్, వరంగల్. 2 to 4 PM.
NTW-0436

PLOT FOR SALE

★యాదగిరిగుట్ట, వంగపల్లిలో గేటెడ్ కమ్యూనిటీ యందు బ్యాంక్ లోన్ సౌకర్యంతో ఓపెన్ ప్లాట్లు కలవు. రిసార్ట్స్, స్విమ్మింగ్ పూల్, పార్క్ అన్ని వసతులతో. Contact: 8106340199.
NT-333076

SHUTTERS FOR SALE
★హనుమకొండ చౌరస్తా మహేంద్ర క్లాత్ షోరూం ప్రక్కన గల్లీలో SSN Reddy కాంప్లెక్స్ నందు 1st ఫ్లోర్‌లో 3 కమర్షియల్ షట్టర్స్ అమ్మకానికి కలవు. సంప్ర॥ సెల్: 8686778662.
NTW-326423

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు